(4)

# సుడిగాలిలోని దీపం

రచన :
శ్రీమతి ఆర్. వసంత

ఆరోజు ఆఫీసు గం. 9-80 నిమిషాలు అయింది.

ప్యూన్ రంగన్న రావడంవలన రాధాదేవి కొంత ఆలస్యంగా వచ్చింది. అయినా చాలా మంది స్టాఫ్ వాళ్ళు వచ్చి వారివారి సీట్లలో కూర్చొని పనులు చేసుకొంటూ పోసాగారు.

రాధాదేవి కుర్చీలో కూర్చొని టేబుల్ మీద వుండే ఫైల్సు చూడడం మొదలు పెట్టింది. కారుడ్రైవరు ఆమె వెనక మరికొన్ని ఫైల్సు టేబుల్ మీదవుంచి వెళ్ళిపోయాడు. రెండు నిముషాలు తర్వాత గోపి కొన్ని ఫైల్సు తీసుకొని లోనికి వస్తూ 'గుడ్ మార్నింగ్ మేడం' అన్నాడు.

తల ఎత్తిచూసి 'రండి గోపి!' అంటూ 'కూర్చోండి' అని 'నిన్నయిచ్చిన స్టేట్ మెంటు చేశారా?' అన్నది

గోపి కూర్చోనకుండా నిలబడి తను వేసిన స్టేట్ మెంటు అందించాడు. రాధాదేవి వాటిని ఒక్కొక్క పేజీలు విడువకుండా ప్రతిపేజీలు చూడసాగింది. గోపి కొంచెము సందేహిస్తూ 'అమ్మగారు! నాకు తెలిసినంతవరకు వేశానమ్మ' ఇందులో ఏమైన కరెక్షన్ వుంటే తెలుపండి చేస్తాను' అన్నాడు.

'గుడ్, బాగానే వేశారు ఇందులోవున్న వాటి?, మన గోడౌన్సులో వున్న సరుకులు కరెక్టుగా వున్నదో లేదో ఒకసారి చూసిరండి, ఎందుకంటే మనము ఎందులోనైనా పొరబాటు పడివుండవచ్చును కదా! కావున గోడౌన్ స్టాక్ కూడ చెక్ చేసి రండి', అని ఆ స్టేట్ మెంట్సు ఫైలును గోపికి అందించింది.

గోపి వాటిని తీసుకొని 'అలాగే' అని గది నుండి బయటకు వచ్చాడు, ప్యూన్ రంగన్న లోనికి రాగా 'రంగన్న! గోపి రాత్రి అంతా వుండి ఆఫీసులో యీ స్టేట్ మెంటు వేసినట్లు వుంది' అన్నది రాధాదేవి.

అవునమ్మా! గోపిబాబు రాత్రి 11-45 నిముషాలు దాకా వ్రాస్తూవున్నాడమ్మా! అటు తర్వాత అతను యింటికి వెళ్ళగానే ఆఫీసుకు తాళంవేసి నేనూ యింటికి వెళ్ళాను' అన్నాడు రంగన్న.

రాధాదేవి లోలోన సంతోషిస్తూ 'అభివృధిలోనికి రావలసినవాడు, బుద్దిమంతుడు' అని చెప్పి తర్వాత ఫైల్సు చూడడంలో మునిగిపోయింది.

రంగన్న కొంత సందేహిస్తూ 'అమ్మగారు' అని పిలిచాడు రాధాదేవి 'ఏమిటి రంగన్న!' అని తలఎత్తి అడగ్గా 'అమ్మాయి పెండ్లికోసం మూడువేలు అడ్వాంసు కావాలని అర్జీ పెట్టాను. దయవుంచి ఇప్పిస్తే బాగుంటుందమ్మా!' అన్నాడు.

వెంటనే ఫోను తీసుకొని బటనునొక్కి 'పరమశివంగారిని రమ్మనండి' అని చెప్పి రిసీవరు పెట్టింది.

మరో రెండునిముషాల్లో అసిస్టెంటు మేనేజరు లోనికి వచ్చి 'పిలిచారా!' అని ఎదురుగా వుండే కుర్చీలో కూర్చొన్నాడు.

రాధాదేవి 'మన రంగన్న తన కుమార్తె పెండ్లికోసం 3 వేలు రూ॥లు కావాలని అర్జీ పెట్టు

కున్నాడు, వెంటనే పై వాళ్ళకు యీ కేసే పంపి రేపులోగా డబ్బులు యిచ్చే విధంగా చూడండి' అన్నది.

పరమశివం లోలోపల భయపడుతూ 'రంగన్న అప్లికేషన్ను యిక్కడవున్న మేనేజింగ్ డైరక్టరుగారికి పంపానండి, ఆయన తన అల్లుడైన భాస్కర్ మీద మీరు సస్పెండ్ ఆర్డరు ఇచ్చారని తెలిసి, రంగన్న మేరేజ్ లోను పాస్ చేయలేదు' అన్నాడు.

రాధాదేవికి ఆ మాటలు వింటూవుంటే ఎక్కడలేని కోపంరాసాగింది అయిన అవన్నీ లోలోన అణచుకుంటూ 'రంగన్న మన సంస్థకు 20 సంవత్సరాలుగా సేవచేశాడు రాత్రనక పగలనక కష్టపడి రక్తాన్ని ధారపోసిన శ్రమజీవి, ఇంకా అతని సర్వీసు 10 సం॥లు వుంది, అయినా అతనికి వుదారంగా యివ్వడములేదు కదా! ప్రతి నెల అసలు వడ్డీతో కలిపి అతనిజీతంలో నుండి తీసుకుంటున్నాము.

కుమార్తె పెండ్లి అని సహాయం కోరితే తిరస్కరించడం బాగులేదు ఆ అవమానం మీదినాది కాదండి, మన సంస్థకు అవమానం. రేపు ఫలానకంపెనీ వాళ్లు, వారి కార్మికునికి సహాయం చేయలేదంటే ఎవరు బాధపడాల్సి వుంది. ఈ సంగతంతా యం. డి. గారికి ఎత్తి చెప్పలేక పోయారా! అన్నది.

అసిస్టెంటు మేనేజరు పరమశివం రాధాదేవి ముఖంలో సూటిగా చూడలేక కొంటెగా చూస్తూ' చెప్పానండి! వారు 'డబ్బు విషయం లాంటిది ఏది నా వద్ద తీసుకరావద్దని, మీరే సర్వాధికారి లాగ వున్నప్పుడు నేను పేరుకు మాత్రం యం. డి. ని, నన్ను కలవకుండా నాతో చెప్పకుండా భాస్కర్ను సస్పెండ్ చేయడం ఎవరిచ్చారు యీ అధికారం. కావున నా దగ్గరకు రావద్దండి' అన్నాడు.

రాధాదేవికి ఆ మాటలు వింటూ వుంటే ముఖం ఎర్రగా మారిపోయింది 'అలాగ అన్నారా! అయితే నేను చూస్తాను. ఆయన ఎంతకాలం నా పనులకు అడ్డు తగులుతూ వుం




మా ప్రత్యేక తయారింపులు !!

* డి ఆర్. ఫైన్ * మాసీక్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స * కాపిటల్
* సంగమ్ ఇంటర్‌లాక్ * ఓపిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* కైరాజ్ * రాకెట్

ఇవి కాక • జెట్టీలు • లండన్ • స్విత్రా • బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.

టారో యీయన ఒక్కరే కాదండి. యింక ఎనిమిది మంది మేనేజింగ్ డైరక్టర్లు వున్నారు. మన కంపెనీకి ద్రోహం చేసి, పతనాన్ని ప్రోత్సహించే భాస్కర్ కాదు, కన్న బిడ్డనైనా నా మనస్తత్వానికి ద్రోహం చేస్తుంటే ఎవరినైనా వుద్యోగం నుండి తీసేయగలను' అని.

ఫోను తీసుకొని కొన్ని నెంబర్లు డైలు చేసి 'హల్లో! కెనరా బ్యాంకు మేనేజరా? నేను నేషనల్ కంపెనీ మేనేజరు రాధాదేవి మాట్లాడుతున్నాను. నమస్కారం. మా రంగన్న దగ్గర చెక్కు పంపిస్తాను. మూడు వేలు డబ్బులిచ్చి పంపండి 'థాంక్స్' అని రిసీవరును పెట్టి-

డ్రాయరు సొరుగులోనుండి చెక్కు బుక్కు అందుకొని 'చూస్తాను. యం. డి. గారు ఎంత వరకు సాధిస్తారో అదీ చూస్తాను. అని చెక్కులో పైకము మూడు వేలు వ్రాసి సంతకం చేసి, చెక్కును రంగన్నకు యిస్తూ' తీసుకో రంగన్న నీవు రాత్రి పగలు కష్టపడి పనిచేసిన యీ కంపెని నీ సేవలు గుర్తించకుండా పోతేను, నేను ఇస్తున్నాను తీసుకో' అని అందించింది. రంగన్న తీసుకోడానికి సందేహిస్తూ వుండగా-

'ఫరవలేదు తీసుకో రంగన్న. ఈ డబ్బు తీసుకుంటేనే నా మనసు కుదుటపడుతుంది. ప్రతినెల నీ జీతంలో కొంతకొంత యిద్దువుగాని, తీసుకో అన్నది. రంగన్న తీసుకొని నమస్కరిస్తూ వెళ్ళిపోయాడు.

అసిస్టెంటు మేనేజరు పరమశివం అంతా చూస్తూ ఏమి చేయులేని నిస్సహాయంగా కుర్చీ నుండి లేస్తూ 'మిమ్మల్ని యం. డి. గారు చూడమన్నారు' అని చెప్పి రూమునుండి వెలుపలికి వచ్చేశాడు,

రాధాదేవికి ఆ మాటలు విని విసజడని విధంగా చెవులకు సోకింది. ఈ సంఘటనను తలచుకుంటూ ఫైల్సు చూడసాగింది. ఫైల్సు చూస్తూ వుందే కాని మనసు మాత్రం గతంలోనికి వెళ్ళసాగింది.

♦ ♦ ♦

అలవాటుప్రకారం రాధాదేవి శైర్లకోసం ఆరోజు వెళ్ళగా రవి ఎందుకో కనిపించలేదు. మరుసటిరోజు అతనికోసం వెళ్ళింది. కాని ఆనాడూ కనుపించలేదు వరుసగా మూడు రోజులు దాటింది ఎందుకో రాధా మనసు రవి కనబడకుండా పోయేసరికి అతన్ని చూడాలని అతనితో మాట్లాడాలని మనసు వుబలాట పడసాగింది.

ఆరోజు శుక్రవారం ఉదయం రవి నాన్న వాళ్ళ అమ్మతో తాంబూలము, పండ్లుగల తట్టతో మాయింటికి వచ్చారు. మా నాన్న దశరథరావు వారిని చూచి 'ఏమిటి అందరు మా యింటికి కట్టకట్టుకొని వచ్చారు' లేక మీ అబ్బాయికి పెండ్లి ఏమైన చేస్తున్నారా? అని వెటకారంతో అన్నాడు.

రవి తల్లి జానకి 'అన్నయ్యా! నీ దీవెనవుంటే రవి పెండ్లి చేయాలని వున్నాము అమ్మాయి ఎవరో కాదు మన అమ్మాయి రాధ' అన్నది.

ఆ మాటలు వింటూవుంటే దశరథ రాధరావు చిర్రున కోపంతో 'ఏమిటి మా అమ్మాయి రాధ! పెండ్లికూతురు మన అమ్మనాన్న కాదని ప్రేమప్రేమం అంటూ యితన్ని పెండ్లిచేసుకున్నావే! ఆ యింట్లో నా కూతుర్ని యిచ్చి సంబంధం చేసుకోవడం! కలలో కూడ జరుగదు అయినా నా కూతుర్ని ఏయింజనీరుకో, డాక్టరుకో యిచ్చి రాజభోగంగా తులతూగే వానికి యిస్తానే కాని, చచ్చిచెడీ నీ కొడుక్కి మాత్రం యివ్వను జాగ్రత్త' అన్నాడు.

రవి తండ్రి 'బావ! మనలో మనం పట్టింపులు భేదాలు ఎందుకు? రవి, రాధనే పెండ్లి చేసుకోవాలని వున్నాడు. రాధకు కూడ రవి అంటే యిష్టం. కావున దయచేసి వారిని వేరుచేయకు నా మీద నీ చెల్లెలి మీద కోపంతో వారికి అన్యాయం చేయకు అని దీనంగా ప్రార్థించాడు.


రాధా వారి మాటలు వింటూ హాలులోనికి వచ్చి 'నాన్న! అమ్మలేని నన్ను గారాబంగా పెంచి, మంచి చదువులు చెప్పించావు నాకు ఏది కావాలన్న లేదనకుండా యిచ్చావు కాని... కాని...నా పెండ్లి నాయిష్టం ప్రకారం చేయించు నీకాళ్ళు పట్టుకొని ప్రార్థిస్తున్నాను. దయచేసి రవి బావతో నా పెండ్లి జరిపించు' అని కాళ్ళపై పడి ప్రార్థించింది.

దశరథరావు కోపంతో 'ఏనాటికీ యీ పెండ్లి జరుగదు, నా ప్రాణం వున్నంతవరకు లేచిపోయి ప్రేమ అంటూ వెళ్ళిన మీ అత్తయ్య కొడుకుతో నా కూతురి పెండ్లి జరుగదు' అని పనిమనిషిని పిలిచి 'రాధను లోనికి తీసుక వెళ్ళు' అన్నాడు. రాధ ఏడ్చుకుంటూ లోనికి వెళ్ళ పోయింది.

మరిరెండు సెకండ్లు తర్వాత జానకి, ఆమె భర్తవైపు తిరిగి 'ఇంకా ఎందుకు వుంటున్నారు అటు సూర్యుడు యిటు పొడిచినా నా నిర్ణయం మాత్రం మారదు. నేను చెప్పింది జరిగితీరవలసిందే వెళ్ళండి' అని కర్కశత్వంతో బదులు చెప్పాడు.

రవి తల్లిదండ్రులు నిరుత్సాహంగా బాధపడుతూ వెళ్ళుతూ వుండగా దసరథరావు 'యిది యిక్కడ ఎందుకు వుంచడం. దీన్ని కూడా మీతో బాటు తీసుక వెళ్ళండి' అని తాంబూలం తట్టను చేత్తో త్రోశాడు. ఆ తట్టలోని పండ్లు తాంబూలాలు చిందరవందరగా పడిపోయింది. ఆ దంపతులిద్దరు ఆ దృశ్యాన్ని చూచి, ఏమి ముట్టుకోకుండా దుఃఖిస్తు వెళ్ళిపోయారు. కిటికీగుండా చూస్తున్న రాధకు యీ భూమి క్రుంగిపోయే విధంగా అనిపించింది. 'శుక్రవారం తనయింటికి వచ్చిన లక్ష్మిని తన తండ్రి నిరాకరించి అవమానించాడు. యింక తన జీవితాన్ని ఎవరు తీర్చి దిద్దుతారు' అని బోరున ఏడ్చుకుంటూ పడక గదిలోనికి వెళ్ళింది.

[ఇంకావుంది.]



'అమరజీవి' చిత్రంలో జయప్రద - పండరీబాయి.